

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

కౌంటింగ్‌కు పక్కా ఏర్పాట్లు

భీమవరం టౌన్, మే 23 : ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం ఏపీ సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం గాకుండా అధికారులు చర్యలు తీసు కోవాలని సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో నిబంధనల మేరకు టేబుల్స్ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు టేబుల్స్, ఏర్పాటుపై ఆయన పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూముల భద్రత, సీసీ కెమెరాల నిఘా ఉండాలన్నారు. ఎన్నికల పరిశీలకులు, అభ్యర్థుల సమక్షంలో పారదర్శకంగా ఓట్ల లెక్కింపు జరగాలన్నారు. జిల్లాలో చేపట్టిన చర్యలపై కలెక్టర్ వివరించారు. జిల్లాలో రెండు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని రానున్న నాలుగు రోజుల్లో అక్కడ పూర్తి ఏర్పాట్లు చేస్తానన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు పార్ల మెంటరీ నియోజకవర్గానికి 10 టేబుల్స్ ప్రతి నియోజక వర్గానికి 4 టేబుల్స్ చొప్పున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజక వర్గానికి మరో ఐదు టేబుల్స్ ఏర్పా టుకు అనుమతికి ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించామని, అదే మాదిరిగా ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నా మని జిల్లా కలెక్టర్ నివేదించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు, ఎలక్షన్ సెక్షన్ సూపరిం టెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సన్యాసిరావు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన

విష్ణు కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కల్పించిన భద్రతా చర్యలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. రోజువారీ తనిఖీలో భాగంగా స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా రెవెన్యూ అధికారితో కలిసి తనిఖీ చేశారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండా లని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపుకు అనువైన హాల్స్‌ను పరిశీలించారు. మీడియా సెంటర్ ఏర్పాటుకు సంబంధించి భవనాన్ని పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నుంచి ఎప్పటికప్పుడు సమా చారాన్ని అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా సమాచార పౌర సం బంధాల అధికారికి సూచించారు.

నేటి నుంచి ఇంటర్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

భీమవరం ఎడ్యుకేషన్, మే 23 :ఈ నెల 24వ తేదీ నుంచి ఇంటర్, పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. జూన్ 3వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకట రమణ తెలి పారు. 41 పరీక్షా కేంద్రాల్లో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు 8,953 మంది హాజరవుతారన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి వారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 83098 83816 నంబర్‌ను సంప్రదిం చాలని తెలిపారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి జిల్లాలో 25 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఇంటర్ పరీక్షల అధికారులు తెలిపారు. మొత్తం మొదటి, రెండో సంవత్సరం కలిపి 10,946 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12.30 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 వరకు నిర్వహిస్తారని తెలిపారు.

రిలాక్స్..



విహార యాత్రల్లో ఎమ్మెల్యే అభ్యర్థులు

కొందరు నేపాల్, శ్రీలంకకు..
మరికొందరు హైదరాబాద్‌కు
ఇంకొందరు స్థానిక కార్యక్రమాల్లో
ఎన్నికల టెన్షన్ కాస్తంత రిలీఫ్ కోసం..

ఎన్నికల నియమావళి తూచా తప్పనట్టు వ్యవహరిస్తూనే తమ పని చక్కబెట్టేందుకు రోజు ఒక క్షణంగా గడిచిపోయింది. ఓటర్ దేవుళ్ళు తమ తీర్పును బ్యాలెట్‌లో భద్రం చేశారు. ఆ తర్వాత కూడా ఎక్కడెక్కడ తనకెన్ని, మిగతా వారికెన్ని ఓట్లు లభించాయో లెక్కల తక్కెడ. నెలల తరబడి క్షణం తీరిక లేకుండా పోయిన అభ్యర్థు లంతా ఇప్పుడు అచ్ వెళ్ళారు. మరికొందరు స్వగ్రామాల్లోనే ఉంటూ స్థానిక కార్యక్రమాల్లో బిజీగా ఉంటున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఈసారి జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రతిష్మాత్మకంగా జరిగాయి. ఓటర్ల దగ్గర నుంచి అభ్యర్థుల వరకు ఎవరు క్షణం తీరిక లేకుండా మునిగితేలారు. ప్రచార సంబరాల్లో జై కొట్టేవాళ్ళు కొందరైతే వ్యతిరేకించేవారు ఇంకొందరు, సామాజిక వర్గాల వారీగా ఓటర్లలో చీలిక. పార్టీల వారీగా అంతకంటే మించి. గెలుపే లక్ష్యంగా ఆసాంతం మడమ తిప్పకుండా అభ్యర్థులంతా పరుగులు తీస్తూనే వచ్చారు. ఎన్నికల రేస్‌లో ఎక్కడ వెనుక పడ్డామో, మరెక్కడ ముందడుగు వేస్తున్నామో అంచనాలు వేసుకుంటూ సరైనబాటలో పయనించేందుకు ప్రయత్నిస్తూనే, అందర్నీ సంతృప్తిపరుస్తూ విమర్శలు, ఆరోపణలు తిప్పికొడుతూ ఇలా సాగిన ఎన్నికల ప్రయాణంలో అభ్యర్థులంతా అలసిసొలసారు. మండుటెండను ఖాతరు చేయకుండా గడపగడపకు తిరిగి కాళ్ళు బొబ్బలెక్కినా ఖాతరు చేయని అభ్యర్థులు ఎందరో. ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో ఓటర్లను మెప్పించడం అంత సులభమేమీ కాదు. ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల పరిధిలో అభ్యర్థులంతా తమంతట తాముగా కొన్ని లక్ష్యాలు పెట్టుకుని, పార్టీ లక్ష్యాలను దీనికి జోడించి మరీ చెమటలు కక్కారు. ప్రధాన పక్షాలు, కూటమి, వైసీపీ అభ్యర్థులైతే నెలల తరబడి కంటిమీద కునుకు లేకుండా వ్యూహాలు రచించి, అమలు చేశారు కూడా. ఈసారి ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే అభ్యర్థుల సంఖ్య భారీగానే ఉంది. గతం కంటే మించి నువ్వా నేనా అన్నట్లు పోటీ సాగింది. క్యాంప్ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలు, నివాసాలన్నీ ఇన్నాళ్ళు పార్టీ అభిమానులు, కార్యకర్తలతో కిక్కిరిసి కనిపించాయి. పోలింగ్ పూర్తి అయిన వారం తర్వాత కూడా దాదాపు ఇదే పరిస్థితి. ఇప్పుడిప్పుడే అభ్యర్థులంతా కాస్త సేద తీరేందుకు కుటుంబ సభ్యులతో కలిసి కాస్త పక్కకు జరిగారు. కొందరు స్వగ్రామాల్లోనే వేచి ఉండి, ఇంకా లెక్కల్లోనే మునిగి తేలుతున్నారు.

ఎవరెవరు... ఎక్కడెక్కడంటే?

ఎన్నికల రేసులో ఇప్పటి వరకు అలసిసొలసిన అభ్యర్థులంతా ఇప్పుడు కాస్త రిలీఫ్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ఓట్ల లెక్కింపునకు ఇంకా గడువు మిగిలి ఉండడంతో కుటుంబ సభ్యులతో కలిసి సుదూర ప్రాంతాలకు వెళ్ళారు. మరికొందరు కేసులకు భయపడి అజ్ఞాతంలో ఉన్నారు. నరసాపురం అసెంబ్లీ స్థానంలో కూటమి అభ్యర్థి బొమ్మిడి నాయకర్ కుటుంబ సభ్యులతో కలిసి హిందూ దేశమైన నేపాల్‌కు వెళ్ళారు. ఖాటాన్‌లో కొద్ది రోజులు ఉండి సేద తీరాలని ఆయన భావిస్తున్నారు. పార్టీ కార్యకర్తలకు ఏ అవసరం వచ్చినా తనకు సమాచారం అందించాలని సూచిస్తూ ఆయన నేపాల్ యాత్రకు వెళ్ళారు. దెందులూరు వైసీపీ అభ్యర్థి అబ్బయ్యచౌదరి యథావిధిగానే లండన్‌లో ఉన్నారు. ఆయన గడిచిన కొన్నాళ్ళుగా లండన్ కేంద్రంగా పనిచేస్తున్నారు. ఎన్నికల సమయంలోనూ, పార్టీ కార్యక్రమాలు అమల్లోనూ అప్పుడప్పుడు నియోజకవర్గానికి వచ్చి వెళ్లడం అలవాటు. ఎలాగో పోలింగ్ ముగిసింది కాబట్టి నేరుగానే లండన్‌కు చేరారు. కౌంటింగ్ సమయానికి సొంత ప్రాంతానికి చేరుకుంటారు. కూటమి అభ్యర్థి చింతమనేని ప్రభాకర్ అనూహ్యంగా ఒక కేసులో నిందితుడిగా పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన చానాళ్ళుగా సొంత ప్రాంతాన్ని వదిలి వేరే ప్రాంతంలో అజ్ఞాతంలోకి వెళ్లారు. ఉంగుటూరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు తన వ్యాపార లావాదేవీల నిమిత్తం అస్సాం రాష్ట్రంలో బస చేశారు. భీమవరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు, వైసీపీ అభ్యర్థి గ్రంథి శ్రీనివాస్ భీమవరంలోనే పార్టీ కేడర్‌కు అందుబాటులో ఉన్నారు. వీరిద్దరు జరిగిన ఎన్నికల్లో ముఖాముఖి పోటీపడ్డారు. మిగతా అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ వీరి మధ్యే ప్రతిష్మాత్మకంగా ఎన్నిక సాగింది. అయినప్పటికి కనీసం సేద తీరేందుకు భీమవరం విడిచి వీరిద్దరూ ఎక్కడికి వెళ్ళలేదు. ఉండి నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి రఘురామకృష్ణరాజు, అన్నవరం, విజయనగరం, విశాఖ పట్నం వంటి ప్రాంతాల్లో కూటమి ముఖ్యులతో భేటీ అవుతూ వచ్చారు. ఎన్నికలు పూర్తయిన దగ్గర నుంచి రఘురామకృష్ణరాజు మరింత బిజీబిజీగా మారారు. వైసీపీ అభ్యర్థి పి.వి.ఎల్.నరసింహరాజు హైదరాబాద్ వెళ్ళి సేద తీరుతున్నారు. ఇదే నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన శివరామరాజు సింహాచలంలో బస చేసినట్టు చెబుతున్నారు. తణుకులో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హైదరాబాద్‌కు వెళ్ళి సేద తీరుతున్నట్టు సమాచారం. ఇదే నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ తణుకు నుంచి కాలుకదపకుండా అక్కడే ఉండి గ్రామాల వారీగా అసలేం జరిగిందో ఆరాలో మునిగి తేలుతున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్ హైదరాబాద్‌లో ఉండగా, వైసీపీ అభ్యర్థి దూలం నాగేశ్వరరావు కైకలూరులో ఉండి పార్టీ శ్రేణులతో నిత్యం చర్చించే పనిలో పడ్డారు. తాడేపల్లిగూడెంలో మరో మంత్రి కొట్టు సత్యనారాయణ ఎన్నికల తర్వాత స్థానికంగానే ఉండిపోయారు. తన నియోజకవర్గంలో ఎక్కడెక్కడ బలం, బలహీనత అనే దానిపై పదేపదే పునః సమీక్షించుకుంటున్నారు. ఇక్కడ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో శ్రీలంకకు వెళ్ళారు. చింతలపూడి నియోజకవర్గానికి చెందిన కూటమి అభ్యర్థి రోషన్‌కుమార్, హైదరాబాద్‌లో మకాం వేయగా, వైసీపీ అభ్యర్థి విజయ్‌రాజు చెన్నైలో బస చేశారు. అక్కడ విజయరాజు కుమారుడు ఐపీఎస్ అధికారిగా ఉన్నారు. నూజివీడు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి మేకా ప్రతాప్ అప్పారావు హైదరాబాద్‌కు వెళ్లగా కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి హైదరాబాద్ - విజయవాడ, నూజివీడుల మధ్య చక్కెర్లు కొడుతున్నారు. ఆచంట నియోజక వర్గంలో కూటమి అభ్యర్థి పితాని సత్యనారాయణ హైదరాబాద్ వెళ్ళగా వైసీపీ అభ్యర్థి రంగనాథరాజు కుటుంబసభ్యులతో కలిసి ఊటికి వెళ్ళారు. పాలకొల్లు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి నిమ్మల రామానాయుడు స్థానికంగానే ఉంటూ అక్కడి ప్రజల సమస్యలపై స్పందిస్తూ తక్షణ చర్యలకు దిగడం విశేషం.



భీమవరంలో తనను కలిసేందుకు వచ్చిన 20వ వార్డు టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో అంజిబాబు



జిల్లా అధ్యక్షుడు రామరాజును శాలువాతో సత్కరిస్తున్న వలవల బాబ్జి

జిల్లాలో ఏడు స్థానాలు కూటమివే

టీడీపీ జిల్లా అధ్యక్షుడు రామరాజు

తాడేపల్లిగూడెం అర్బన్,మే 23 :రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు అన్నారు. జిల్లాలో ఏడు స్థానాలు కూటమే కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. నర్సాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ అత్యధిక మెజారిటీతో గెలుస్తారన్నారు.తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జిని గురువారం పట్టణ పార్టీ కార్యాలయంలో రామరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఐదేళ్ల పార్టీ కోసం కష్టపడిన బాబ్జి జనసేనకు టిక్కెట్ కేటాయించినా నిస్వార్థంగా కూటమి అభ్యర్థి విజయం కోసం కృషి చేశారని కితాబిచ్చారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 15 స్థానాలను కూటమి కైవసం చేసుకుంటుందన్నారు. అనంతరం రామరాజు ను శాలువా, పుష్పగుచ్చంతో బాబ్జి సత్కరించారు. పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, గంధం సతీష్, వాడపల్లి సుబ్బరాజు, ముత్యాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మూగజీవాలు ఉసూరుమంటున్నాయి. ఎనిమిది నెలలుగా సబ్సిడీపై పశువులకు అందజేసే దాణా సరఫరా నిలిచిపోయింది. జనవరి 2022 నుంచి పశు బీమా చెల్లింపులు నిలిచిపోయాయి. జిల్లాలో పాడి రైతులను ఆదుకునే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన పథకాలన్నీ జగన్ ప్రభుత్వంలో ఒక్కొక్కటిగా అటకెక్కాయి.



మూగజీవాలకూ మొండిచేయే..!

ఏడాది కాలంగా బీమా సొమ్ములు లేవు
500 మంది లబ్ధిదారులకు బకాయిలు
ధీమా ఇవ్వని పశువుల బీమా
సబ్సిడీ దాణాకు తికానా లేదు
పాడి రైతులకు ప్రోత్సాహం కరువు

పాలకొల్లు, మే 23 :సబ్సిడీపై పశువులకందించే దాణా ఎనిమిది నెల లుగా నిలిచిపోయింది. రెండు మండలాలకు 25 టన్నులు చొప్పున సర ఫరా చేసే దాణా లబ్ధిదారులకు సుమారు 8 నెలలుగా అందడం లేదు. దీనికి కారణం సరఫరాదారులకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడమే అని తెలుస్తోంది. మరోవైపు దురదృష్టవశాత్తు పశువులు మరణిస్తే వాటి కి అందజేసే బీమా సొమ్ములు నిలిచిపోయాయి. 2021 డిసెంబరు వ రకు కొందరు మాసాంతం వరకు బీమా సొమ్ము చెల్లించినప్పటికి 2022 జనవరి మొదలు డిసెంబరు మాసాంతం వరకు చనిపోయిన మూగజీవాలకు ఇప్పటికి ఒక్క రూపాయి బీమా సొమ్ము అందలేదు. పాడి రైతులను ఆదుకునే ఉద్దేశంతో వైఎస్ఆర్ పశు బీమా పేరుతో పాడి పశువులకు బీమా సదుపాయాన్ని జగన్ సర్కారు ఏర్పాటు చేసింది. సంకర జాతి గేదెలు, ఆవులకు రూ.30 వేలు చొప్పున దేశవాళి గేదెలు, ఆవులకు రూ.15 వేలు చొప్పున బీమా ఉంటుంది. ఈ బీమా నిమిత్తం లబ్ధిదారులు ఏ విధమైన సొమ్ము చెల్లించాల్సిన అవసరం లేదు. నేరుగా ప్రభుత్వమే బీమా మొత్తాన్ని రైతుకు అందజేస్తుంది. దుర దృష్టవశాత్తు పశువులు మృతి చెందినపుడు ఈ బీమా మొత్తాలను అందజేస్తారు. 2022 డిసెంబరు 31 వరకు ఈ ఉచిత వైఎస్ఆర్ పశు బీమా పథకం అమలులో ఉండగా 2023 జనవరి నుంచి ఆ విధానం రద్దు చేశారు.

1.54 కోట్లు బకాయి

2023 జనవరి 1 నుంచి రైతులు భాగస్వామ్యంతో బీమా చేసుకునే విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఇందులో 50 శాతం బీమా స్కీమ్ కేంద్ర ప్రభుత్వం, 25 శాతం బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన 25 శాతం బీమా ప్రీమియం రైతు చెల్లించాల్సి ఉంటుంది. రైతు రూ.369 చెల్లిస్తే మిగిలిన ముప్పాతిక భాగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రీమి యంగా చెల్లిస్తాయి. అయితే 50 శాతం పైబడి కేంద్ర ప్రభుత్వమే భరిస్తున్నప్పటికి ఈ పథకానికి సైతం జగన్ సర్కార్ వైఎస్ఆర్ పశు బీమా పథకం అని నామకరణం చేశారు. ప్రస్తుతం ఈ పథకం అమలులో ఉంది. అయితే 2022 క్యాలెండర్ ఇయర్‌లో చెల్లించాల్సిన బీమా సొమ్ములకు తికానా లేకపోయింది. 494 మంది లబ్ధిదారులకు గా ను 532 పాడి పశువులకు కోటి 54 లక్షల 80 వేలు చెల్లించాలి. అయితే ఈ మొత్తాన్ని ఇప్పటికీ చెల్లించలేదు. 2023 మార్చిలో బడ్జెట్ నిధులు విడుదల కాగా సంబంధిత శాఖ ఆన్‌లైన్ ద్వారా లబ్ధిదారుల వివరా లను, చెల్లించాల్సిన బీమా మొత్తాన్ని నమోదు చేసినప్పటికి సర్కారు ఇప్పటికి సొమ్ములు చెల్లించలేదు. పాడి రైతుల పరిస్థితి ఆర్థికంగా తీసిక ట్టుగా వున్న పరిస్థితిలో కనీసం మొత్తంలో ఇచ్చే బీమా సొమ్ము సకా లంలో రాకపోవడంతో పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి పాడి పశువుల ధర ఇపుడు రూ.లక్ష పైబడి ఉంది. అయితే ప్రభుత్వం రూ.30 వేలకు ఉచితంగా బీమా సౌకర్యం ఇస్తుందనే ఉద్దేశం తో రైతులు జనరల్ ఇన్సూరెన్స్ వైపు వెళ్లకుండా ప్రభుత్వం కల్పించే సౌకర్యం వినియోగించుకున్నారు. ఇపుడు ఇచ్చే స్వల్ప బీమా మొత్తా లను ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైంది. కాగా 2023 నుంచి ప్రారంభ మైన నూతన విధానంలో పాడి పశువులను కోల్పోయిన బాధిత రై తులకు సకాలంలో బీమా సొమ్ములు అందుతున్నాయి.

రైతులకు అన్నీ కష్టాలే..

గత టీడీపీ హయాంలో పచ్చగడ్డి పెంచుకోవడానికి రైతులకు ఎకరా నికి రూ.25 వేలు ప్రభుత్వం అందజేసేది. ఆ పథకం జగన్ సర్కార్ వ చ్చిన తరువాత అటకెక్కింది. సబ్సిడీపై పశువుల దాణా అందిస్తున్నట్లు జగన్ సర్కార్ గొప్పలు చెప్పుకున్నప్పటికి ఆచరణలో అంతంతమాత్రమే అయ్యింది. పశువుల దాణా కిలో రూ.15.80 పైసలకు కొనుగోలు చేస్తే రై తులకు రూ.6.50 పైసలకు అందజేసేవారు. అరకొరగా ఇచ్చే ఈ దాణా గత ఎనిమిది నెలలుగా ఆగిపోయింది. ముందుగానే రైతుల వద్ద సొమ్ములు వసూలు చేసినా అధికారులు దాణా రాకపోవడంతో రైతులకు తిరిగి చెల్లిస్తున్నారు. ఇపుడు ప్రభుత్వం మారితేనే ఏమైనా ప్రయోజనం ఉంటుందని పాడి రైతులు ఆశిస్తున్నారు. సబ్సిడీపై చిన్న తరహా పాడి రైతులకు పశువుల దాణా అందజేస్తేనే పశుపోషణ సాధ్య మవుతుందని రూ.లక్షల వ్యయంతో పాడి పశువులను కొనుగోలు చేసి ఎండుగడ్డిని సైతం వేలాది రూపాయలు ఖర్చు చేస్తూ పశుపోషణ భార ంగా మారిన పరిస్థితుల్లో ప్రభుత్వ పరంగా చేయూత ఉంటేనే చిన్నత రహా పాడి రైతులు పశువులను పోషించే పరిస్థితి ఉంటుంది.

కొల్లేరు బీటలు

ఎండిన అతిపెద్ద మంచినీటి సరస్సు



- మనుగడ కోల్పోయిన మత్స్య సంపద
- గుక్కెడు నీళ్ల కోసం తిప్పలు అనేకం
- ఆటపాక.. పక్షుల కేంద్రానికే పరిమితం

కొల్లేరు కళ తప్పి ఎడారిని తలపిస్తోంది. పరవళ్ళు తొక్కే మంచినీటి సరస్సు వెలవెలబోతుంది. పచ్చని భూములు బీటలు వారాయి. పక్షుల కిలకిలరావాలు ప్రకృతి సోయగాలు కనిపించడంలేదు. సరస్సు అందాలు అవిరయ్యాయి. ఆసియా ఖండంలోనే అతిపెద్ద సరస్సుగా పేరొందిన కొల్లేరులో నేడు మనుషులకే కాదు పక్షులకూ గుక్కెడు నీరు దొరకని పరిస్థితులు ఏర్పడ్డాయి. అక్కడక్కడ ఉన్న నీటి కుంటల్లో పక్షులు సేద తీరుతున్నాయి. కొల్లేరును చూస్తే ఇది మంచినీటి సరస్సేనా అని సందేహం కలుగుతుంది. ఎప్పుడూ నీళ్లతో కళకళలాడే కొల్లేరు సరస్సు నేల బీటలు వారిన దుస్థితి నెలకొంది.

- కైకలూరు, మే 23 :

ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడంతో సరస్సులో నీరు లేదు. 77,138 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొల్లేరు సరస్సుకు సుమారు 60 మీడియం, మైనర్ డ్రెయిన్లు, కాలువల నుంచి పది టీఎంసీల నీరు కొల్లేరులోకి ప్రతీ ఏడాది చేరుతుందని నిపుణులు అంచనా వేసేవారు. కళకళలాడుతున్న కొల్లేరులోని నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రమార్గం ద్వారా ప్రవహించి సరస్సు అంతర్భాగంలో ఐదు టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని అంచనా. నేడు అందుకు భిన్నంగా సరస్సు ఎడారిని తలపిస్తోంది. వాతావరణ సమతుల్యత దెబ్బతిని సరస్సు కళ కోల్పోయింది. ఒకప్పుడు ఈ ప్రాంతంలో భూగర్భజలాలు సమృద్ధిగా ఉండేవి. రానురాను భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. పది అడుగులు లోతు వెళితే ఉప్పునీరు వస్తుంది.

సుదీర్ఘ ప్రాంతాలకు వలసలు

నీటి కళతో కళకళలాడుతున్న సమయంలో కొల్లేరు ప్రజలు సంప్రదాయ చేపలవేట చేసుకుని జీవనం సాగించేవారు. చేపల వేటపై ఆధారపడే వేలాది కుటుంబాలు జీవించేయి. నేడు నీరు లేక చేసేదిలేక ప్రజలు సుదీర్ఘ ప్రాంతాలకు వలసలు పోతున్నారు. సుమారు 50 ఏళ్ల కాలంగా ఇలాంటి దుస్థితి కానరాలేదు. గత మూడు, నాలుగేళ్ల కాలంలో కొద్దిమేర నీటి నిల్వలు ఉండేవి. ఈ పరిస్థితిని ఎన్నడూ చూడలేదని కొల్లేటిలోని ప్రజలు వాపోతున్నారు. ఉప్పుటేరు నుంచి సముద్రపు పోటు కలిగి కైకలూరు, ఆకివీడు మండలాల్లోని కొల్లేరు సరస్సులోకి ఉప్పుటేరు ప్రవహిస్తుంది. ఈ నీటి వల్ల మత్స్యసంపదకు నష్టం వాటిల్లితుంది. ఈ నీరు పశువులు తాగేందుకు కూడా పనికిరావడం లేదు.



ఒడ్డుకు చేరిన మత్స్యకారుల దోనెలుల

తిరుగు ముఖం పడుతున్న పక్షులు

కొల్లేరులో సామర్థ్యానికి తగిన నీటి నిల్వలు లేకపోవడంతో సుదీర్ఘ ప్రాంతం నుంచి వచ్చే వలసపక్షులు కూడా తిరిగిముఖం పట్టాయి. కొల్లేరులో లభించే 80 రకాల మత్స్యసంపద మనుగడ ప్రశ్నార్థకమైంది. కైకలూరు నుంచి ఏలూరు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా ఉన్న కొల్లేరు సరస్సులో చిన్నచిన్న నీటికుంటలు కన్పించిన దాఖలులు లేవు. ఎంత వర్షాభావం తక్కువగా ఉన్న చిన్న, పెద్ద ఎడ్లగాడిలో ఎప్పుడూ నీరు ప్రవహిస్తూనే ఉండేది. అలాంటిది ఈ ఏడాది గాడిల్లో నీరు లేక నేలబీటలు వారింది. కొల్లేరు అభయారణ్యప్రాంతంలో అక్కడక్కడ పచ్చిక బైల్లు కూడా ఎండిపోవడంతో పశువులకు మేత దొరకడం లేదు. పలు దేశాల నుంచి వచ్చే వలస పక్షులకు ఆటపాకలోని 310 ఎకరాల్లో ఏర్పాటుచేసిన పక్షుల కేంద్రంలో తప్ప ఎక్కడా నీరు దొరికే పరస్థితి కనిపించడం లేదు. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పక్షులు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిపోతున్నాయి.

ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మించాలి..

గతంలో కొల్లేరులో సరస్సు ఎగువ భాగాన పంటలు పుష్కలంగా పండేవి. ఏ గ్రామంలో చూసినా వ్యవసాయం ఉండడంతో రెండు పంటలకు నీరు అందడంతో ఆ నీటిని కాలువలు, డ్రెయిన్ల ద్వారా కొల్లేరులోనికి వదిలే వారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చేపలచెరువులే కనిపించడంతో ఉన్న నీటిని కొందరు సైక్లింగ్ చేసుకోవడమే తప్ప దిగువ కొల్లేరులోకి నీరు వదిలే పరిస్థితులు లేవు. ఇప్పటికైనా ఉప్పుటేరుపై రెగ్యులేటర్ నిర్మించేలా ప్రకృతి ప్రేమికులు, నిపుణులు కోరుకుంటున్నారు.

నీటి నిల్వలు పెంచేందుకు చర్యలు తీసుకుంటాం

కొల్లేరు సరస్సులోకి నీరు వచ్చే సుమారు 60 మేజర్, మైనర్ డ్రెయిన్లు పూడుకుపోవడంతో నీరు ఎగువ నుంచి సరస్సులోకి చేరడం లేదు. వీటి ఆధునికీకరణ కోసం అటవీశాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదికలు అందజేశాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధునికీకరణ పనులు చేపట్టినీరు నిల్వలు పెంచేందుకు కృషి చేస్తాం.

కేవీ నాగలింగాచార్యులు,
అటవీశాఖ రేంజర్, కైకలూరు

రెగ్యులేటర్ నిర్మించాలి



పేరుకే కొల్లేరు మంచినీటి సరస్సు పుస్తకాల్లోనూ, రికార్డుల్లో మాత్రమే ఇది వర్తిస్తుంది. తాగేందుకు చుక్క నీరు లేదు. ఎగువ ప్రాంతాల్లోని రైతులు వారి అవసరాలకు అడ్డుకట్టు వేసి దిగువకు నీరు పారుదల జరగకుండా ఆపడంతో డిసెంబరు నెలకే సరస్సు ఎడారిలా మారిపోతుంది. నీరు నిల్వ చేసుకునేందుకు రెగ్యులేటర్ నిర్మాణం చేసేలా ప్రభుత్వాలు కృషి చేయాలి.

- ఘంటసాల వెంకటేశ్వరరావు
కొవ్వాడలంక


కొల్లేరులో నీళ్లు తాగేవాళ్లం



వర్షాకాలంలో కొల్లేరులో కొద్దిమేర నీరు ఉన్నప్పటికి అనతి కాలంలోనే ఎండిపోవడంతో తాగేందుకు, పశువులకు సైతం నీరు, మేత దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతీ ఏడాది ఇదే పరిస్థితి కొనసాగుతుంది. మా చిన్న తనంలో కొల్లేరులోని నీటినే తాగి జీవించేవాళ్ళం. ప్రస్తుతం కైకలూరు, ఆటపాక ప్రాంతాల నుంచి నీటిని కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

- పోతురాజు మహేష్,
కోమటిలంక

పట్టిసీమ పట్టదా ?



పంచాయతీ కార్యాలయం వద్ద కోతకు గురైన దృశ్యం

- కోతకు గురైన అవుట్ ఫాల్ స్లూయిజ్ గట్టు

పోలవరం, మే 23 : వర్షాకాల సీజన్‌లో కొవ్వాడ కాలువ, కొండవాగుల జలాలు పంట పొలాలను ముంచెత్తి ఇసుకమేటలు వేసి రైతులు నష్టపోతున్న నేపథ్యంలో కొండవాగుల జలాలు గోదావరిలోకి వెళ్లేలా గోదావరి జలాలు లోపలికి రాకుండా ఇరిగేషన్ అధికారులు పట్టిసీమ వద్ద అవుట్ ఫాల్ స్లూయిజ్ నిర్మించారు. పట్టిసీమ గ్రామం వద్ద కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్‌కి గోదావరి వైపు ఇరువైపులా రక్షణ గోడ నిర్మించకపోవడం వల్ల గట్టు కోతకు గురయ్యింది. పట్టిసీమ పంచాయతీ కార్యాలయం గోడల కింద వరకు గట్టు కోతకు గురవుతోంది. దీని వల్ల రానున్న వర్షాకాలంలో కొండవాగుల వరద జలాల ఉధృతికి మరింత కోతకు గురై పంచాయతీ కార్యాలయం, కార్యాలయం పైనున్న గ్రామ రెవెన్యూ కార్యాలయం కాల్వలోకి పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గత మార్చిలో పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చిన ఏలూరు జిల్లా జేసీ లావణ్యవేణి, జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య దృష్టికి స్థానికులు సమస్యను తెలుపగా.. పరిస్థితి పరిశీలించి ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటివరకు ఈ విషయంలో ఏ ఒక్క అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవు. నిర్లక్ష్యంగా వదిలేస్తే ఈ వర్షాల సీజనుకి పట్టిసీమ శివక్షేత్రానికి వెళ్లే ఫెర్రీ రేవు కొట్టుకుపోయే అవకాశాలున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కొవ్వాడ కాల్వ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు సీహెచ్ భాస్కర్‌ని వివరణ కోరగా అవుట్ ఫాల్ స్లూయిజ్‌కి ఇరువైపులా రక్షణ గోడ, స్పిల్ ఛానల్ కాంక్రీట్ పనుల నిర్మాణం కోసం ఒక కోటి 12 లక్షల రూపాయల నిధుల కోసం ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామని నిధులు మంజూరైన తర్వాత నిర్మాణం చేపడతామన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఈఏపీ సెట్

ఏలూరు రూరల్/భీమవరం రూరల్, మే 23: ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫారసీ (ఈఏపీసెట్) 2024 పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈనెల 16 నుంచి పరీక్షలు ప్రారంభం కాగా 23వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. 16,17 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ(బైపీసీ స్ట్రీమ్) పరీక్షలు జరగ్గా, 18 నుంచి 23 వరకు ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ (ఎంపీసీ స్ట్రీమ్) పరీక్షలు జరిగాయి. ఏలూరు జిల్లాలోని ఏలూరులో మూడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. చివరి రోజు 483కు గాను 469 మంది విద్యార్థులు హాజరు కాగా, 14మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లాలో చివరి రోజు భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 171కి 159, డీఎన్నార్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 150కి 143 మంది విద్యార్థులు, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ పరీక్ష కేంద్రంలో 100 మందికి 97ని, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో 156కి 150 మంది విద్యార్థులు హాజరయ్యారు.

జనరల్ సర్జరీ, ఈఎన్‌టీల్లో ఆరోగ్యశ్రీ సేవలు ప్రారంభిస్తాం

ద్వారకాతిరుమల, మే23: విర్డ్ ఆసుపత్రిలో జనరల్ సర్జరీ, ఈఎన్‌టీల్లో ఆరోగ్యశ్రీ సేవలను త్వరలో అందుబాటులోకి తెస్తామని విర్డ్ ఆసుపత్రి ఛైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. స్థానిక విర్డ్ ఆసుపత్రిలో గురువారం సుధాకరరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అనంతరం 23మంది దివ్యాంగులకు కాలిపర్స్, కృత్రిమ అవయవాలను గుప్తా ఫౌండేషన్ సహకారంతో అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ వి.ఆనందరాజు, ట్రస్టీలు ఐవీఆర్ సుధాకరరావు, వి.నారాయణమూర్తి, ఎంఎం గుప్తా, రాజబాబు, వంశీ, ఈవో త్రినాథరావు, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి, ఏవో ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న దాత గుప్తా

జిల్లా సీనియర్ చెస్ చాంపియన్ లక్ష్మణరావు

ఏలూరుటూటౌన్, మే 23: జిల్లా సీనియర్ చెస్ చాంపియన్‌గా లక్ష్మణరావు ఎంపికయ్యారు. జిల్లా చెస్ అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో దీప్తి చెస్ అకాడమిలో గురువారం జిల్లా సీనియర్ చెస్ చాంపియన్‌షిప్-2024 పోటీలు జరిగాయి. జిల్లా నుంచి 40మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన మొదటి నలుగురు క్రీడాకారులు ఈనెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరగబోయే రాష్ట్ర పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని ఏలూరు చెస్ అడ్‌హాక్ కమిటీ కో-కన్వీనర్ ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. పోటీల్లో మొదటి స్థానం లక్ష్మణరావు, రెండో స్థానం సుచిత్ర, మూడో స్థానం రక్షిత, నాలుగో స్థానంలో సోనాలి కార్తీక నిలిచారు. మొదటి నాలుగు స్థానాలు పొందిన క్రీడాకారులకు సిట్ కంప్యూటర్స్ అధినేత కావూరి వేణుగోపాల్, దీప్తి చెస్ అకాడమి డైరెక్టర్ కే.కృష్ణకుమారి, కో-కన్వీనర్ ఎస్.కోటేశ్వరరావు, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ కే.శివరంగనాథ్, క్రీడాకారులకు బహుమతుల ప్రదానం చేశారు.



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

సీహెచ్‌సీ సిబ్బంది పనితీరుపై పీవో ఆగ్రహం

ఏజెన్సీ అలవెన్స్‌లు నిలుపుదల చేయాలి.. వైద్యులు, సిబ్బంది పనితీరుపై నివేదిక ఇవ్వాలని డీఎంవోకు ఆదేశం

బుట్టాయగూడెం, మే 23 :బుట్టాయగూడెం సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది పనితీరుపై కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.సూర్యతేజ తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆకస్మిక తనిఖీల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి ఆసుపత్రికి వెళ్లగా వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున రెండు గంటల వరకు పీవో ఆసుపత్రిలో ఉండి పనితీరును, రికార్డులను, వైద్యులు, సిబ్బంది విధుల సమయాలను పర్యవేక్షించారు. ఎవరూ అందుబాటులో లేకపోవడంతో ఏజెన్సీ అలవెన్సులు నిలుపుదల చేయాలని డీఎంవోను ఆదేశించారు. బుద్దులవారిగూడెంకు చెందిన బుద్దుల ప్రేమ్‌కుమార్ సైకిల్ తొక్కుతూ ఈనెల 20న కిందపడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని తాత గాంధీ బుట్టాయగూడెం సీహెచ్‌సీకి తీసుకురాగా ప్రాథమిక వైద్యం అందించిన వైద్యులు, సిబ్బంది తలకు తగిలిన గాయానికి మెరుగైన వైద్యసేవలు అందించలేదు. రెండు రోజులు తర్వాత మనుమడికి వైద్య అందించాలని కోరినా ఆసుపత్రిలో పట్టించుకోకపోవడంతో వైద్యులు, సిబ్బందిని నిలదీయడంతో ఆసుపత్రి వర్గాలు తమపై దౌర్జన్యం చేస్తున్నారంటూ పోలీసులకు చెప్పడమేకాకుండా ప్రేమ్‌కుమార్‌ను ఇంటికి పంపించడంతో ఈ విషయం సీరియస్ అయ్యింది. జరిగిన విషయాన్ని తాత గాంధీ ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ దృష్టికి తీసుకువెళ్ళారు. దీనిపై ఆగ్రహించిన పీవో ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సుమారు మూడు గంటల పాటు ఆసుపత్రిలో ఉండి వైద్యులు, సిబ్బంది డ్యూటీకి రావడం, వెళ్ళడం, వైద్యసేవలు అందించడం, రికార్డుల నమోదు తదితర విషయాలను పరిశీలించారు. పీవో ఆసుపత్రికి వచ్చినపుడు ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది అలసత్వంపై నిలదీశారు. రోగులకు భోజనం పెట్టాల్సి ఉండగా బుధవారం రాత్రి పెట్టకపోవడాన్ని గుర్తించి సిబ్బందిపై చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సమయాల్లో రక్తం కొనేందుకు ఆసుపత్రికి రూ.20 వేల నిధి ఉంటుందని మోతుగూడెం నుంచి డెలివరీకి వచ్చిన కొండరెడ్డి గర్భిణికి రక్తం తక్కువగా ఉంటే వారినే తెచ్చుకోమనడం ఏమిటని నిలదీశారు. ఆరోగ్యశ్రీ అమలులో ఉన్న ఆసుపత్రిలో ఆరోగ్యమిత్రలు ఎందుకులేరని ప్రశ్నించారు. గాయపడిన బాలుడికి తక్షణమే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రేమ్‌కుమార్ నందాపురం పీహెచ్‌సీలో వైద్యం పొందుతున్నాడు. ఆసుపత్రి పనితీరుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డీఎంవో జె.సురేష్‌కమార్‌ను ఆదేశించారు.



బుట్టాయగూడెం సీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న పీవో సూర్యతేజ

పోలీసులు హద్దు మీరితే.. ఫిర్యాదు చేయండి

- పైసా ఖర్చులేదు.. ఆరు నెలల్లో పరిష్కారం
- పోలీసు కంప్లైంట్స్ అథారిటీ ఛైర్మన్ విశ్వనాథం

రాజమహేంద్రవరం, మే 23(ఆంధ్రజ్యోతి): పోలీసులు విధులు దుర్వినియోగం చేసిన సందర్భాల్లో వారిపై పోలీసు కంప్లైంట్స్ అథారిటీకి బాధితులు లేదా వారి సంబంధీకులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటామని అథారిటీ ఛైర్మన్, విశ్రాంత జిల్లా న్యాయమూర్తి ఆర్‌జే విశ్వనాథం పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరులోని అథారిటీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల పరిధిలోని కానిస్టేబుళ్ల దగ్గర నుంచి డీఎస్పీ స్థాయి వరకు వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టే అధికారం రాజమహేంద్రవరం కేంద్రంగా పనిచేస్తున్న అథారిటీకి ఉందన్నారు. గుంటూరులో ఉన్న రాష్ట్రస్థాయి అథారిటీకి ఎస్పీ నుంచి డీజీ వరకూ అధికార పరిధి ఉందన్నారు. తమ పరిధిలోని ఏదైనా జిల్లాకు సంబంధించి ఎక్కువగా ఫిర్యాదులు వస్తే అక్కడికే వెళ్లి విచారణ చేపడతామని చెప్పారు. ఫిర్యాదుదారులు dpcarajamahendravaram@gmail.com మెయిల్ ద్వారా లేదా 99484 64363 నంబరుకు వాట్సాప్ ద్వారా లేదా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ, వైటీసీ, బొమ్మూరు, రాజమహేంద్రవరం రూరల్‌కి రిజిస్టరు పోస్టు ద్వారా తమ అర్జీలను పంపించవచ్చని తెలిపారు. తమ కార్యాలయానికి వచ్చి నేరుగా సమస్యను తెలిపి ఫిర్యాదు అందజేయవచ్చన్నారు. కస్టడీలో మరణించడం, అత్యాచారం, కస్టడీలో తీవ్ర గాయాలు కావడం, భూ కబ్జాలు, సివిల్ తగాదాల్లో కల్పించుకోవడం, ప్రాథమిక హక్కులను ఉల్లంఘించి వ్యక్తులను ఇబ్బంది పెట్టడం వంటి వాటిపై ఘటన జరిగిన రోజు నుంచి ఏడాది లోపుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. దీనికి ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. గరిష్టంగా ఆరు నెలలలోపుగా విచారణ పూర్తి చేసి సదరు ఉద్యోగి విధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని రుజువైతే చర్యలకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు. పోలీసులపై ఫిర్యాదు చేస్తే వారితో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయం అవసరం లేదన్నారు. అథారిటీ ఏర్పాటైన తర్వాత 14 ఫిర్యాదులపై విచారణ జరిపి 10 కేసులకు పరిష్కారం చూపించామన్నారు. 4 కేసుల విచారణ వివిధ దశల్లో ఉందన్నారు. అథారిటీపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అథారిటీ సభ్యులు విశ్రాంత స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎం.జితేంద్ర, విశ్రాంత ఏఎస్పీ బి.లక్ష్మీనారాయణ, న్యాయవాది మన్మథరావు పాల్గొన్నారు.

రాజమన్నార్‌గా చిన వెంకన్న

ద్వారకాతిరుమల, మే 23: వైశాఖ మాస దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం అనంతరం బుధవారం అర్ధరాత్రి వెండి గరుడవాహనంపై స్వామి, అమ్మవార్లను ఉంచి అలంకరించిన అర్చకులు అట్టహాసంగా తిరువీధిసేవ జరిపారు. ఉత్సవంలో భక్తులు పాల్గొని స్వామికి హారతులను సమర్పించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజుకో అలంకరణలో కటాక్షిస్తున్న స్వామి వారు గురువారం చంద్రకోలు, దండం ధరించి సర్వాభరణాలతో రాజమన్నార్‌గా భక్తులను అనుగ్రహించారు.



రాజమన్నార్ అలంకరణలో శ్రీవారు

శ్రీవారి రథోత్సవం రద్దు

చినవెంకన్న క్షేత్రంలో గురువారం రాత్రి జరగాల్సిన రథోత్సవం అనివార్య కారణాల వల్ల రద్దు చేశామని ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు ప్రకటించారు. కల్యాణం మరుసటి రోజున రథోత్సవాన్ని నిర్వహించడం సంప్రదాయం. రథాన్ని ఆలయ ప్రధానకూడలికి తెచ్చి పచ్చిపూలతో, విద్యుత్‌దీప తోరణాలతో సుందరీకరించారు. ఏర్పాట్లు పూర్తయిన అనంతరం సాయంత్రం గ్రామంలో అసౌచం(మరణం) ఏర్పడడం వల్ల ఉత్సవాన్ని నిలుపుదల చేశారు.

బీఎల్‌వోలకు గౌరవ వేతనం విడుదల చేయాలి

ఏలూరు కలెక్టరేట్, మే 23 : రాష్ట్రంలో ఎన్నికల్లో పనిచేసిన బీఎల్‌వోలకు ఇచ్చే గౌరవవేతనం గత మూడేళ్ళుగా ఇవ్వడం లేదని తక్షణం మూడేళ్ళకు సంబంధించి గౌరవవేతనం విడుదల చేయాలని కోరుతూ గురువారం రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావును విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు ఒక్కొక్క బీఎల్‌వోకు రూ.18వేలు రావాల్సి ఉందన్నారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలకు సంబంధించి ఒక్కొక్క పోలింగ్ స్టేషన్‌కు సుమారు రూ.10 వేలు వరకు రకరకాలుగా ఖర్చు పెట్టారని, దీనివల్ల వీఆర్వోలు, బీఎల్‌వోలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్పష్టం చేశారు. ఒక్కొక్క బీఎల్‌వోకు రూ.10వేలు ఇచ్చేలా రిటర్నింగ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. గౌరవవేతనం ఫైల్ ఫైనాన్స్‌లో ఉందని, త్వరలో నిధులు విడుదల చేస్తారని ఎన్నికల అదనపు ప్రధాన అధికారి కోటేశ్వరరావు హామీ ఇచ్చారని తెలిపారు. గ్రేడ్-2 వీఆర్వోల ప్రొహిబిషన్‌కు సంబంధించి ప్రభుత్వం మెమో ఇచ్చి మూడు నెలలు అవుతున్నా జిల్లా అధికారులు ప్రొహిబిషన్ విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం వారందరికి ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని, సీసీఎల్ఏ అధికారులను కోరినట్లు వివరించారు. కారుణ్య నియామకం ద్వారా నియమితులైన వారికి కూడా ప్రొహిబిషన్ డిక్లేర్ చేయాలని రెవెన్యూ డిప్యూటీ సెక్రటరీని కోరినట్లు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.లక్ష్మీనారాయణ, బాలాజీరెడ్డి, హనుమంతు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

160 కేజీల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, మే 23: ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతికి అందిన సమాచారంతో ఏలూరు సమీపంలోని కలపర్రు టోల్‌గేటు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఓ కారును తనిఖీలు చేయగా అందులో ఎనిమిది గోనె సంచులలో ఒక్కొక్క సంచిలో పది ప్యాకెట్లు గంజాయి ఉండడాన్ని గుర్తించారు. మొత్తం 160 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ 10 లక్షల 55 వేలు ఉంటుందని గుర్తించారు. వాహనంలో ఉన్న నిందితులైన మహారాష్ట్రకు చెందిన బరమతి గ్రామానికి చెందిన జామీర్ పింజరి, మహారాష్ట్రలోని థానీ జిల్లాకు బివన్ గ్రామానికి చెందిన అంతిక్యూ అహ్మద్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఏలూరు ఎస్ఈబీ స్టేషన్ సీఐ కె. విద్యాసుధాకర్, ఎస్ఐ వి.శివప్రసాద్, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు, పాల్గొన్నారు. వీరిని అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న ఏఎస్పీ సూర్యచంద్రరావు

నకిలీ లెమన్ డ్రింక్స్ తయారీ కంపెనీపై దాడి

ఏలూరు క్రైం/తాడేపల్లిగూడెం రూరల్, మే 23 : తాడేపల్లిగూడెం మండలం రామన్నగూడెంలో సెవెన్ స్టార్స్ బాట్లింగ్ కంపెనీలో నకిలీ కూల్ డ్రింక్స్ తయారవుతున్నాయని జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ యూజే విల్సన్, ఎస్ఐ రంజిత్‌కుమార్, ఫుడ్‌సేఫ్టీ అధికారి సుందరరామిరెడ్డి, తూనికలు కొలతల అధికారి అప్పలనాయుడు వారి సిబ్బందితో గురువారం సాయంత్రం ఆ కంపెనీపై దాడి చేశారు. అక్కడ అనధికారికంగా లెమన్ సాఫ్ట్ డ్రింకులు తయారు చేసి వాటిని సీసాల్లో నిల్వ చేసి వాహనాల్లో చుట్టుపక్కల పట్టణాలు, ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లుగా గుర్తించారు. అక్కడ వాడుతున్న రసాయనాలను, ఇతర సామగ్రిని తనిఖీలు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఆ డ్రింక్‌లను తయారు చేస్తున్నట్టు గుర్తించి ఆ కంపెనీ యజమాని చింతా శివకుమార్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అక్కడ ఉన్న బాటిల్స్‌ను సీజ్ చేశారు.

కృష్ణబాబుకు ఎంపీ రఘురామ నివాళులు

కొవ్వూరు, మే 23 : కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకటకృష్ణారావు (కృష్ణబాబు) మృతి వార్త తెలిసిన వెంటనే పలువురు ప్రముఖులు, పార్టీలకతీతంగా దొమ్మేరు విచ్చేసి కృష్ణబాబు సోదరులు ది.ఆంధ్రసుగర్స్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్‌చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు)లతోపాటు రంగబాబు, కృష్ణబాబు కుమారుడు రవిబాబు, అల్లుడు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ, కృష్ణబాబు కుటుంబ సభ్యులను కలిసి సంతాపం వ్యక్తం చేశారు. కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ఉండి కూటమి అభ్యర్థి రఘురామకృష్ణరాజు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు కృష్ణబాబు కు నివాళులర్పించారు. అవంతి ఫీడ్స్ ఛైర్మన్ అల్లూరి ఇంద్రకుమార్, టీడీపీ నాయకులు అల్లూరి విక్రమాదిత్య, మాజీ ఎమ్మెల్యే కొవ్వూరు నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, అర్బన్ బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్ని, కొవ్వూరు పట్టణ టీడీపీ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, కె.వి.కె.రంగారావు, టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



దొమ్మేరులో ఆంధ్రా సుగర్స్ ఛైర్మన్ నరేంద్రనాథ్ చౌదరి, జేఎండీ అచ్చిబాబులను పరామర్శిస్తున్న ఎంపీ రఘురామకృష్ణరాజు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెదపాడు, మే 23 : రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందినట్టు పెదపాడు ఎస్ఐ కె.శుభశేఖర్ తెలిపారు. వట్లూరుకు చెందిన దేవరం భాస్కరరాజు(51) ఈనెల 22వ తేదీన ఓ మోటారుసైకిల్‌పై వట్లూరు నుంచి కాటూరు వెళుతుండగా కలపర్రు వద్ద ప్రమాదవశాత్తు రోడ్డుపై వెళుతున్న వ్యక్తిని ఢీకొన్నాడు. ఈ ఘటనలో భాస్కరరాజుకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుంతల ముసలమ్మకు పౌర్ణమి పూజలు



నరసాపురం టౌన్, మే 23: రాయపేటలో పుంతల ముసలమ్మ అమ్మవారికి వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌరిదేవి పూజలు చేసి ముత్తైదువులకు వాయనాలిచ్చారు. ఈ పూజా కార్యక్రమాన్ని అర్చకులు మంచిలి దుర్గాప్రసాద్ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. కమిటీ సభ్యులు తమ్మిశెట్టి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామికి మామిడి పండ్లతో అలంకారం



భీమవరం టౌన్, మే 23 : గునుపూడిలోని శ్రీసోమేశ్వర జనార్దన స్వామి వార్ల దేవస్థానంలో వైశాఖ మాసం పౌర్ణమి పర్వదినం సందర్భంగా శ్రీ స్వామి వారికి మామిడి పండ్లతో అలంకారం చేశారు. ఉదయం పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తుల అందించిన మామిడి పండ్లతో అలంకారం చేశారు.

ఫోటోలు ఉన్నాయి 23 పిఎన్‌టి- 2,3 అని ఉంటాయి.

రామలింగేశ్వరస్వామికి పోటెత్తిన భక్తులు



పెనుమంత్ర, మే 23 నత్తా రామేశ్వరంలో పరశురాముడు ప్రతిష్ఠించిన శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. ఏడాదిలో 11 నెలలు నీటిలో ఉండి ఒక్క వైశాఖమాసంలో దర్శనమిచ్చే రామ లింగేశ్వర స్వామిని దర్శించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తర లివచ్చారు. వేకువ జాము నుంచి భక్తులు స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు ఏకాదశ రుద్రాభిషేకం సహస్రనామార్చనలు నిర్వహించారు. పార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

శ్రీకృష్ణునికి విసన కర్రలతో అలంకారం



భీమవరం టౌన్, మే 23 : వైశాఖ మాసం పౌర్ణమిని పురస్కరించుకుని బంట్రోతుల వారి వీధిలో శ్రీకృష్ణునికి విసన కర్రలతో అలంకారం చేశారు. ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు నిర్వహించారు.

సోమేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి విరాళం



భీమవరం టౌన్, మే 23 : గునుపూడిలోని సోమేశ్వర జనార్దన స్వామి వార్ల నిత్య అన్నదానం ట్రస్టునకు సాగి అచ్యుత రామరాజు జ్ఞాపకార్థం కుమారుడు సాగి విఠల్ రంగరాజు లక్ష రూపాయలు విరాళంగా అందించారు. ఆలయానికి వచ్చిన దాత ముందుగా స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం తరుపున శేష వస్త్రాన్ని, ప్రసాదాన్ని అందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

నరసాపురం టౌన్, మే 23: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ ఎ.నళినిదేవి అన్నారు. బుధవారం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్ని ఆమె సందర్శించారు. సెలవుల్లో పిల్లలు టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలన్నారు. పుస్తక పఠనం, లెక్కల్లో మెలకువలు, స్పోకెన్ ఇంగ్లీషు వంటి అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరీ అధికారి కుమారి, జి.శ్రీనివాస్, నాగలక్ష్మి, సుధీర్‌మోహన్, సూర్యంబాబు, ప్రవీణ్, జీవన్ పాల్గొన్నారు.

టీడీపీ కూటమి గెలవాలని పూజలు

ఆకివీడు, మే 23: ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడాలని పట్టణ టీడీపీ అధ్యక్షులు బొల్లా వెంకట్రావు దంపతులు గురువారం అరుణాచలంలో పూజలు నిర్వహించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మరలా అధికారం చేపట్టడానికి వైసీపీ ప్రభుత్వం అనేక అల్లర్లు సృష్టించిందని, జూన్ 4న కౌంటింగ్ ఎటువంటి గొడవలు లేకుండా సక్రమంగా జరిగి చంద్రబాబు సీఎం ప్రమాణస్వీకారం చేయాలని అరుణాచలేశ్వరుడిని కోరుకున్నామన్నారు.

సుందరకాండ మహాయజ్ఞం

పాలకోడేరు, మే 23: పాలకోడేరు శివారు గొస్తనీనది ప్రాంగణంలోని శ్రీకోదండరామ ఆలయం వద్ద ప్రధాన మంత్రి మోదీ గెలుపొందాలని సుందరకాండ మహాయజ్ఞం నిర్వహించారు. ఈ యాజ్ఞంలో గ్రామస్థులతో పాటు రాజకీయ నాయకులు, ప్రముఖులు పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

క్షీరా రామంలో చండీ హోమం

పాలకొల్లు అర్బన్, మే 23 : శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం చండీహోమం నిర్వహించారు. 26 మంది దంపతులచే హోమం నిర్వహించారు. చండీ హోమంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి శేష వస్త్రాలను బహూకరించారు. పార్వతీ దేవి, లక్ష్మీ అమ్మవార్లకు కుంకుమ పూజలు చేసి అలంకరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

పెనుమంత్ర, మే 23 : అత్తిలి మండలం పాలికి చెందిన కుక్కల హనుమంతరావు మేనత్త వడ్డి బోయిన కొండ రత్నం(63) గురువారం మధ్యాహ్నం పెంటపాడు మార్టేరు రహదారి పక్కన గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందిందని మేనల్లుడు హనుమంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పెనుమంత్ర ఎస్సై రవీంద్రబాబు తెలిపారు.

కళాశాల భవనం పైనుంచి దూకిన విద్యార్థి

భీమవరం క్రైం, మే 23 : పట్టణంలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థి కళాశాల భవనం పైనుంచి దూకేసిన సంఘటన బుధవారం జరిగింది. చదువులో బాగా రాణిస్తున్న ఆ విద్యార్థి ప్రవర్తనలో రెండు రోజులుగా మార్పులొచ్చాయని స్నేహితులు చెబుతున్నారు. ఏదో తన దగ్గరకు వస్తున్నట్టు ఉందంటూ అమాంతంగా పైనుంచి కిందకు ఓ రోజున దూకేయత్నం చేయగా స్నేహితులు పట్టుకుని అతని తండ్రికి సమాచారం ఇచ్చారు. ఎందుకు అలా ప్రవర్తిస్తున్నావని అడిగితే.. బాగానే ఉన్నానంటూ చెప్పుకొచ్చాడన్నారు. మరలా గురువారం భవనం పైనుంచి దూకిన తరువాత గాయాలు కాగా స్థానికంగా చికిత్స చేయించిన అతని కుటుంబ సభ్యులు వెంట తీసుకెళ్లారు. ఈ సంఘటనలపై ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు చెప్పారు.

వ్యభిచార గృహం పై దాడి

తణుకు. మే23 : పట్టణంలోని వెంక ట్రాయపురంలో వ్యభి చార గృహం పై పోలీ సులు గురువారం దాడి చేశారు. ఈ సంఘటనలో ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకు న్నట్లు రూరల్ పోలీ సులు తెలిపారు. వెంకట్రాయపురంలోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగు తుందనే సమాచారంతో దాడి చేసి ఇద్దరు నిర్వాహకు లతో పాటు మరో ఇద్దరు యువతులు, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకు న్నట్లు చెప్పారు. దీనికి సంబంధించి రూరల్ ఎస్ఐ చంద్ర శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం క్రైం, మే 23 : భీమవరం పట్టణంలోని ఏఎస్ఆర్ నగర్‌కు చెందిన నడింపల్లి ఫణిరాజు ఈనెల 21వ తేదీ నుంచి ఇంటి నుంచి బయటకు వెళ్ళగా తిరిగి రాకపోవడంతో అతని బావమర్ది రమేష్‌కుమార్‌రాజు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ చెప్పారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపండి

పెంటపాడు, మే 23 : విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రత్తిపాడు 3ఎఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఓంప్రకాష్‌గోయింకా సూచించారు. బాబా ఆనందమూర్తిజీ జయంతి సందర్భంగా ప్రత్తిపాడు 3ఎఫ్ ఇండస్ట్రీస్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఆశ్రమంలోని పిల్లలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో 3ఎఫ్ ఇండస్ట్రీస్ జనరల్‌మేనేజర్ జనార్ధన్, కోఆర్డినేటర్ వేమాల శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ జీ.శ్రీనివాసరెడ్డి , ఆశ్రమం ఆసుపత్రి కో ఆర్డినేటర్ ధనిష్ఠ లు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



మొగల్తూరు, మే 23: ఎన్నికల ఓట్లు లెక్కింపు రోజున ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం సీఐ కె.గోవిందరాజు హెచ్చరించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా గురువారం రామన్నపాలెం గ్రామంలో నరసాపురం, మొగల్తూరు పోలీసులతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామంలో సంచరించినా, మద్యం, సారా అక్రమ నిల్వలున్నా, పెట్రోల్, మందుగుండు సామగ్రి నిల్వ చేసినా తమకు సమాచారం అందించాలని మొగల్తూరు ఎస్ఐ కె. వెంకట రమణ సూచించారు. గ్రామంలోని వాహనదారులు తమ వాహనాలకు సంబంధించి సరైన పత్రాలుండాలని లేని పక్షంలో అటువంటి వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.

ఖాతాదారులకు విశిష్ట సేవలు



బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్ శ్రీనివాస్

నరసాపురం, మే 23: బ్యాంకింగ్ రంగంలో ఖాతాదారులకు విశిష్ట సేవలు అందించడంలో బ్యాంకు ఆఫ్ ఇండియా ముందు వరుసలో ఉందని బ్యాంకు జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో కొండాలమ్మ గుడి ఆర్చ్ వద్దకు మార్చబడిన బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యాలను అధిగమిస్తూ రైతులకు, డ్వాక్రా సంఘాలకు, స్వయం ఉపాధి రుణాలు అందించడంలో బ్యాంకు ఆఫ్ ఇండియాదే పైచేయిగా నిలిచిందని వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ఎస్‌జీవీ గాంధీ నాయుడు, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు వి.రవిశంకర్, యూనియన్ నాయకులు టి.సూర్యనారాయణ, ప్రత్యేక సహాయకులు రహీమ్ పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా: అంజిబాబు

భీమవరం టౌన్,మే 23 : ప్రతి కార్యకర్త కష్టాల్లో అండగా ఉంటానని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. గురువారం నాడు 20వ వార్డుకు చెందిన జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మెంటే పార్థసారథి, మెంటే కాశీవిశ్వేశ్వరరావు(గోపి), తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంప్‌ల పరిశీలన



ఆచంట/పెనుగొండ, మే 23: ఆచంట, పెనుగొండ మండలాల్లోని కోడేరు, కరుగోరుమిల్లి, సిద్దాంతం ఇసుక ర్యాంప్‌లను గురువారం జిల్లా మైనింగ్ అధికారులు, స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రానున్న రోజుల్లో ఇసుక ర్యాంప్ నిర్వహణ బాటలు, అక్కడ అనుకూల పరిస్థితుల కోసం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరితోపాటు పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సరిపల్లెలో ఫ్యాక్టరీ ఎదుట ఉద్యోగుల ఆందోళన



ఫ్యాక్టరీ వద్ద పోలీసులతో మాట్లాడుతున్న ఉద్యోగులు

గణపవరం, మే 23: సరిపల్లె గ్రామంలో గత 11 సంవత్సరాలుగా చేపల, రొయ్యలు మేతల తయారు చేసే థాయ్‌లాండ్‌కు చెందిన కంపెనీ సరిపల్లెలో నడుస్తూ వచ్చింది. నష్టాల్లో ఉందని యాజమాన్యం ప్రస్తుతం ఉన్న ఫ్యాక్టరీని గత కొంత కాలం నుంచి ఉత్పత్తిని నిలుపుదల చేసిందని ఉద్యోగులు చెబుతున్నారు. 71మంది ఉద్యోగులు పని చేస్తున్నామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళారు. ఫ్యాక్టరీ వద్ద ఉద్యోగులు బుధవారం నుంచి ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు కూడా ఎటువంటి సంఘటనలు జరగకూడదని ముందస్తుగా ఫ్యాక్టరీ వద్ద భద్రత కల్పించారు. ఫ్యాక్టరీ యాజమాన్యం వైపు నుంచి వివరాలు తెలిపేందుకు అందుబాటులో లేరు.

జోరుగా బెట్టింగులు

తణుకు, మే 23 : ఎన్నికలు ఫలితాలలో అభ్యర్థుల గెలుపోటములపై పందేం రాయుళ్ల జోరుగా బెట్టింగులు కాస్తున్నారు. ఎన్నికల నోటిపికేషన్ ముందు, తర్వాత నుంచి ప్రారంభమైన పందేలు ఎన్నికల తర్వాత తగ్గిపోయాయి. మళ్లీ నాలుగు రోజుల నుంచి పందేలు జోరందుకున్నాయి. ప్రధానంగా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని కొందరు, వైసీపీ వస్తుందని కొందరు సీట్లు విషయంలోను పందెలు జరుగుతున్నాయి. రాష్ట్రంలో వైసీపీకి 70 సీట్లకు మించి రావని లక్షల్లో పందేలు కాస్తున్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వస్తుందని కూడా పందేలు జరుగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలోని వైసీపీ వచ్చే సీట్ల విషయంలోను పందేలు కాస్తున్నారు. ఆచంట, ఉండి నియోజకవర్గాలు మినహా మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించి పందేలుకు ముందుకు రావడం లేదు. తణుకు సీటు విషయంలోను మెజార్టీలపైనే పందేలు జరుగుతున్నాయి. ఒకటికి, రెండు వంతులు ఇస్తున్నామని చెబుతున్నా ఎవరూ ముందుకు రావడం లేదని పలువురు చెబుతున్నారు. నిడదవోలు నిజయోజకవర్గంలోను జనసేన మెజార్టీపైనే పందేలు జరుగుతున్నాయి.









ఉప్పులూరులో కేశవస్వామి.. ఉండి, కాళ్ళకూరుల్లో వేంకటేశ్వర స్వామి రథోత్సవాలు.. తాడేపల్లిగూడెంలో నరసింహస్వామి రథోత్సవం

వైభవంగా రథోత్సవాలు

ఉండి, మే 23: ఉప్పులూరులోని చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. నడివీధి నుంచి స్వామివారి రథాన్ని లాగుతూ మంచినీటి చెరువు వద్దకు తోడ్కొని వచ్చారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ యర్రా వెంకట సుబ్బారావు, సర్పంచ్ యర్రా దుర్గారావు, ఎంపిటీసీ నిమ్మల బాలు, యర్రా సుబ్రహ్మణ్యం, మాజీ ఆలయ కమిటి చైర్మన్ నిమ్మల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

● ఉండిలోని వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రధానంగా గ్రామానికి చెందిన మహిళలు పెదసంఖ్యలో రథోత్సవానికి విచ్చేశారు. రథాన్ని మహిళలు లాగుతూ పెద్ద వంతెన సెంటర్ వరకు తరలించారు. ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: పాతూరులో నరసింహస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగం గా బుధవారం రథోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాతూరు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొ ని రథాన్ని లాగి స్వామివారి ఊరేగింపులో భాగస్వా ములయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

కాళ్ల(ఉండి): కాళ్లకూరులో శ్రీవారి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం జరిగింది. రథోత్సవంలో మంగళవాయిద్యాలు, సన్నాయిమేళాలు, కేరళ డప్పులు, తీన్మార్ డప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామివారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు.

శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పణ



తణుకు, మే 23 : ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో స్వామి కల్యాణం సందర్భంగా జిల్లా పద్మశాలి సంఘం తరుపున రాష్ట్ర పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు వావిలాల సరళాదేవి, వెంకట రమేష్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ అందజేసినట్లు సరళాదేవి గురువారం తెలిపారు. పద్మశాలి ఆడబిడ్డ అయిన అమ్మవారికి మేళతాళాలు, కోలాటం వంటి సంప్రదాయ పద్ధతిలో తీపి కావిడలు అందజేశారు. పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు వానపల్లి నాగరాజుతో పాటు, పలువురు సంఘస్తులు పాల్గొన్నారు.

దైవారాధనను మించిన భక్తి మరొకటి లేదు



వేదపండితుల ఆశీర్వచనాలు అందుకుంటున్న శ్రీనివాసవర్మ దంపతులు

భీమవరం టౌన్, మే 23 : వేదల్లోంచే అన్ని ఉద్భవిస్తాయని, 11 రోజులపాటు మహా యాగాలను మన ప్రాంతంలో నిర్వహించడం గొప్ప విశేషమని నరసాపురం ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాలలో జరుగుతున్న అతి రాత్ర మహాయాగంలో భాగంగా గురువారం భక్తులకు సోమ రసాన్ని అందించారు. యజ్ఞ కర్త జంధ్యాల శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ మాట్లాడుతూ దైవారాధన మించిన భక్తి మరొకటి లేదని, ఇటువంటి మహా యజ్ఞ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని అన్నారు.

పని చేయడంలోనే విశ్రాంతి: ఎమ్మెల్యే నిమ్మల



ఆగర్తిపాలెంలోని సొంత ఆక్వా చెరువులో సీడ్ వేసేందుకు సిద్ధం చేసే పనుల్లో నిమ్మల

పాలకొల్లు రూరల్, మే 23: కష్టపడి పనిచేస్తే పని విలువ తెలియడంతో పాటు ఆరోగ్యం మెరుగు పడి ఆత్మతృప్తి కలుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. కొన్ని నెలలుగా అవిశ్రాంతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి, ఎన్నికలు ముగిసి ఫలితాలు కోసం ఎదురు చూస్తున్న సమయంలో బుధవారం కొద్ది సమయం తన సొంత వ్యవసాయ క్షేత్రం (ఆగర్తిపాలెం)లోని ఆక్వా చెరువులో సీడ్ వేసేనిమిత్తం సిద్ధం చేస్తున్న పనుల్లో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని మందు పిచికారి చేశారు. రైతు బిడ్డగా ఏ కొద్దిపాటి సమయం చిక్కినా నాకున్న వరి, ఆక్వా చెరువు పనుల్లో స్వయంగా పని చేసుకుంటానని నిమ్మల తెలిపారు. పనిచేయడంలోనే విశ్రాంతి లభిస్తుందన్నది తన సిద్ధాంతం అని రామానాయుడు తెలిపారు.

పేకేరులో ఢిల్లీ బృందం పర్యటన



ఢిల్లీ బృందంతో పేకేరు సర్పంచ్ హేమ కుమారి, తదితరులు

ఇరగవరం, మే 23 : భారత దర్శన్ కార్యక్రమంలో భాగంగా డిల్లీలోని కేంద్ర సచివాలయ సెక్షన్ అధికారులు గురువారం పేకేరు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కునుకు హేమకుమారి మహిళా సాధికారిత, మహిళలకు సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, గ్రామ స్థాయిలో ఏ విధంగా అందుతున్నాయి. వాటిని ఎలా వినియోగించుకుంటున్నారో సెక్షన్ అధికారులకు వివరించారు. అనంతరం కేంద్ర బృందం ఇటీవల ఐక్యరాజ్య సమితిలో దేశం తరఫున మహిళా సాధికారత పై ప్రాతినిధ్యం వహించిన సందర్భంగా హేమకుమారికి అభినందనలు తెలిపారు.

ధనరాజుకు పరామర్శ

తాడేపల్లిగూడెం రూరల్, మే 23: నవాబుపాలెం సర్పంచ్ మద్దుకూరి ధనరాజు తండ్రి సత్యనారాయణ మృతికి సంతాపంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి బుధవారం పరామర్శించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనై జింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

25న స్క్రీనింగ్ టెస్టు

భీమవరం ఎడ్యుకేషన్, మే 23 : ఈనెల 25న ఏపీ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి స్క్రీనింగ్ టెస్టు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. ఇందుకోసం జిల్లాలోని మూడు డివిజన్ కేంద్రాల్లో ఆరు పరీక్షా కేంద్రాలల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. భీమవరంలో డీఎన్ఆర్ ఇంజనీరింగ్ టెక్నాలజీలో 130 మందికి, భీమవరంలోని విష్ణు ఇన్‌స్టిట్యూట్‌లో 100మందికి, భీమవరంలో డీఎన్ఆర్‌లో 100మందికి, నరసాపురంలో స్వర్ణాంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో 100మందికి, తాడేపల్లిగూడెంలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలలో 250 మందికి, తాడేపల్లిగూడెంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలల్లో 160 మందికి మొత్తం 840 మందికి టెస్టు నిర్వహిస్తామన్నారు. అదే రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11-30 వరకు నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షకు వచ్చే అభ్యర్థులు ఉదయం 7-30 నుంచి 8-15లోపు పరీక్ష కేంద్రం వద్ద ఉండాలన్నారు. 8-30 వరకు అవకాశం కల్పిస్తారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్టుతోపాటు పాస్‌పోర్టుకానీ, పాన్ కార్డు కానీ, ఓటరు ఐడికానీ, ఆధార్ కార్డు కానీ, ఎంప్లాయిమెంట్‌కార్డుకానీ, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకటి తెచ్చుకోవాలన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎలాక్ట్రానిక్స్ వస్తువులను తీసుకురాకూడదన్నారు. పరీక్ష పూర్తి అయ్యేంత వరకు అభ్యర్థులను బయటకు పంపరని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు అర్బన్, మే 23 : విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం పట్టణంలోని కొన్ని ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు నరసాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్ కుమార్ తెలిపారు. రాజీవ్ నగర్, బెత్లహంపేట, లయన్స్ కంటి ఆసుపత్రి ఏరియా, ప్రభుత్వ ఆసుపత్రి, రామారావు పేట, కొత్తపేట, పెద్ద సాయిబాబా వారి గుడి ఏరియా, వెలమ గూడెం, కృష్ణ భవానీ ఆసుపత్రి ఏరియా, బిఆర్ఎంవిఎం హైస్కూల్, లజపతిరాయ పేట తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ర్యాలీలకు అనుమతి లేదు

పెనుగొండ, మే 23: వివాదాస్పద సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు బాధ్యత తీసుకోవా లని ఎస్ఐ షేక్ సుభాని అన్నారు. గురువారం వడలి గ్రామంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కౌంటింగ్ రోజున ర్యాలీలకు మందు గుండు సామగ్రి ఉపయోగించడానికి అనుమతులు లేవన్నారు.

ఆకివీడు మండలంలో 85.8 శాతం

ఆకివీడు, మే 23: ఈ నెల 13 జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఆకివీడు మండలంలో59970 మంది ఓటర్లు ఉండగా 51457 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం మీద 85.8 శాతం నమోదైంది. బూత్‌ల వారీగా ఓటింగ్ శాతం ఇలా ఉన్నది..

బూత్ నంబరు	గ్రామం పేరు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
01	పెదకాపవరం	859	775	90.22
02	పెదకాపవరం	748	691	92.38
03	పెదకాపవరం	1176	954	81.12
04	పెదకాపవరం	553	491	88.79
22	చినకాపవరం	1159	1054	90.94
23	చినకాపవరం	1390	1197	86.12
24	అప్పారావుపేట	1087	930	85.56
25	చినమిల్లిపాడు	1125	938	83.38
26	చినమిల్లిపాడు	1077	952	88.39
27	సిద్ధాపురం	928	82	88.47
28	సిద్ధాపురం	843	770	91.34
29	సిద్ధాపురం	1094	981	89.67
30	రాజులపేట	540	447	82.78
31	గుమ్ములూరు	1234	1132	91.73
32	గుమ్ములూరు	1131	1001	88.51
81	తరటావ	528	455	86.17
82	కోళ్ళపర్రు	805	722	89.69
83	కోళ్ళపర్రు	1045	898	85.93
84	దర్భాపురం అగ్రహారం	782	668	85.42
85	మాదివాడ	1261	1080	85.65
86	మాదివాడ	983	852	86.67
87	మాదివాడ	1019	911	89.40
116	అజ్జమూరు గరువు	602	486	80.73
117	అజ్జమూరు	856	733	85.63
118	ఆకివీడు	1125	860	76.44
119	ఆకివీడు	1118	911	81.48
120	ఆకివీడు	888	765	86.15
121	ఆకివీడు	645	562	87.13
122	ఆకివీడు	958	799	83.40
123	ఆకివీడు	700	535	76.43
124	ఆకివీడు	1105	1021	92.40
125	ఆకివీడు	1064	928	87.22
126	ఆకివీడు	806	660	81.89
127	ఆకివీడు	677	565	83.46
128	ఆకివీడు (ఎం)	801	662	82.65
129	ఆకివీడు	1057	890	84.20
130	ఆకివీడు	1087	883	81.23
131	ఆకివీడు	729	564	77.37
132	ఆకివీడు	575	466	81.04
133	ఆకివీడు	789	642	81.37
134	మాదివాడ	585	467	79.83
135	ఆకివీడు	1056	896	84.85
136	ఆకివీడు	1118	921	82.38
137	ఆకివీడు	631	493	78.13
138	ఆకివీడు	767	660	86.05
139	ఆకివీడు	1052	894	84.98
140	ఆకివీడు	832	644	77.40
141	ఆకివీడు	580	474	81.72
142	ఆకివీడు	747	644	86.21
143	ఆకివీడు	775	647	83.48
144	దుంపగడప	883	782	88.56
145	దుంపగడప	634	591	93.22
146	దుంపగడప	553	515	93.13
147	దుంపగడప	696	618	88.79
148	దుంపగడప	994	886	89.13
149	దుంపగడప	884	725	82.01
150	అయి-భీమవరం	955	831	87.02
151	అయి-భీమవరం	993	822	82.78
152	అయి-భీమవరం	919	760	82.70
153	మందపాడు	1045	949	90.81
154	కుప్పనపూడి	926	857	92.55
155	కుప్పనపూడి	1192	1063	89.18
156	కుప్పనపూడి	1152	1022	88.72
200	చెరుకుమిల్లి	1239	1099	88.70
201	చెరుకుమిల్లి	851	731	85.90
202	చెరుకుమిల్లి	962	814	84.62
		59970	51457	85.8

భానుడి భగభగ

మధ్యాహ్నం నిర్మానుషంగా మారుతున్న రహదారులు



ఆచంటలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి



ఆకివీడులో గొడుగు నీడన వెళుతున్న వృద్ధురాలు

ఆకివీడు/ఆచంట, మే 23: సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఎండ తీవ్రతకు ప్రజానీకం విలవిలలాడుతున్నారు. బయటకు రావాలంటే భయపడుతున్నారు. ప్రధాన రహదారిలో వాహనాల రాకపోకలు తగ్గాయి. ఉదయం పది గంటల తరువాత ప్రజలు, పదకొండు దాటినాక వాహనదారులు అంతగా రోడ్లపై కనిపించకపోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. వాతావరణంలో తేమశాతం తగ్గిపోవడం, వేడి విపరీతంగా పెరిగిపోవడం వలన ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే మెయిన్ సెంటర్లలో గురువారం ఎండ తీవ్రతకు రోడ్లపై ఎవరూ కనిపించడంలేదు. బేరాలు లేక పోవడంతో వ్యాపారస్థులు మధ్యాహ్నం సమయంలో దుకాణాలు మూసేస్తున్నారు. ఎండ నుంచి విముక్తి పొందడానికి ప్రజలు పండ్లు, పండ్లరసాలు, కూల్ డ్రింక్స్ సేవించి ఉపశమనం పొందుతున్నారు.

కౌంటింగ్ కేంద్రం పరిశీలన



ఉండి అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న జేసీ, ఉండి ఆర్వో ప్రవీణ్ ఆదిత్య

ఉండి, మే 23: ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టరు, ఉండి ఆర్వో సిఏ ప్రవీణ్‌ఆదిత్య పరిశీలించారు. గురువారం ఉండి నియోజకవర్గానికి సంబంధించి భీమవరంలోని ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆయన పరిశీలించి తగు సూచనలను అందించారు. కౌంటింగ్ కేంద్రాలలో కౌంటింగ్ సిబ్బందికి, మీడియాకు మొబైల్ ఫోన్లు, అభ్యర్థులకు ప్రత్యేక టెంట్లును ఏర్పాటు చేయాలన్నారు. మీడియాకు ప్రత్యేక రూమ్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మీడియా వారిని కౌంటింగ్ రూమ్ వద్దకు పోలీస్ ఎస్కార్ట్‌తో పంపాలన్నారు. మెయిన్ గేట్ వద్ద ఐడికార్డ్‌ను చూసి లోపలకు పంపాలన్నారు.

పెనుమంత్రతో కౌంటింగ్ మొదలు..

ఆచంట, మే 23: భీమవరం విష్ణు క్యాంపస్‌లో ఉన్న సీతా పాలిటెక్నిక్ కళాశాలల 2వ అంతస్థులో వచ్చే నెల 4న ఆచంట నియోజకవర్గ కౌంటింగ్ జరుగుతుందని ఆర్వో వి.స్వామి నాయుడు తెలిపారు. నియోజకవర్గంలో 187 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఓట్ల లెక్కింపులో ముందుగా పెనుమంత్ర మండలంలో సోమరాజు ఇల్లిందలపర్రు ఈవీఎంను ఓపెన్ చేసి లెక్కింపు మొదలెడతారని అనంతరం వరుసగా పెనుగొండ, పోడూరు, ఆచంట, మండలాల్లో పోలైన ఓట్లను లెక్కిస్తారన్నారు. చివరగా ఆచంట మండలం అయోధ్యలంకలోని పుచ్చలంక పోలింగ్ బూత్ ఈవీఎంతో కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆర్వో గురువారం కౌంటింగ్ ఏర్పాట్లుపై తహసీల్దార్‌లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు.

12 రౌండ్లలో నరసాపురం కౌంటింగ్

నరసాపురం, మే 23: వచ్చే నెల 4న జరిగే కౌంటింగ్‌లో నరసాపురం ఫలితాలను 12 రౌండ్లలో వెల్లడించనున్నట్లు రిటర్నింగ్ అధికారి అంబరీష్ తెలిపారు. ప్రతి రౌండ్‌లో 14 టేబుల్స్‌పై కౌంటింగ్ జరుగుతుందన్నారు. జిల్లాలో తక్కువ ఓటర్లు కలిగిన నియోజకవర్గం కావడంతో తొలి ఫలితాన్ని వెల్లడించే అవకాశం ఉంది.